సాక్షి
విజయనగరం
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



'స్వమిత్వ'తో ఆస్తి హక్కు

తాతతండ్రుల నుంచి గ్రామాల్లో తమ ఆధీనంలో ఉన్న ఇళ్లకు, స్థలాలకు 'స్వమిత్వ'తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత హక్కు కల్పిస్తున్నాయి. -8లో



కుక్కల దాడిలో మేక పిల్లల మృతి

సాలూరు పట్టణంలోని వైటీసీ సమీపంలో కుక్కల దాడిలో 31 మేక పిల్లలు మృతిచెందాయి. -8లో



సొంతింటి కల సాకారం

రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. -8లో

'ఫ్యామిలీ డాక్టర్' వైద్యంపై మరింత శ్రద్ధ

ప్రతినెలా ఊరిలోకే వస్తున్న ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన వైద్యులు... రోగులకు ఉచిత వైద్యపరీక్షలు.. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి కోలుకునేలా మందులు అందజేత.. అవసరమైన వారిని ఆస్పత్రికి తరలింపు.. పైసా ఖర్చులేకుండా మెరుగైన వైద్యసేవలు.. ఇదీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఫ్యామిలీడాక్టర్ వైద్యం. ప్రతినెలా సచివాలయం పరిధిలో రెండుసార్లు నిర్వహించే వైద్యశిబిరాలకు స్పందన పెరగడంతో మరింత మెరుగైన వైద్యసేవలందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శిబిరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఫ్యామిలీడాక్టర్ సేవలతో ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తోంది.



పుర్రేయవలసలో తల్లీబిడ్డల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

- రోగులందరూ వినియోగించుకునేలా చర్యలు
- వైద్యశిబిరం నిర్వహించే ముందురోజు ఊరిలో దండోరా
- రోగుల ఇళ్లకు వెళ్లి తెలియజేయనున్న ఆశ కార్యకర్తలు
- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది ఉండేలా ఆదేశాలు
- జిల్లాలో ఇప్పటివరకు 3.60 లక్షల మందికి సేవలు
- 17,560 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు
- మంచంపై ఉన్న రోగుల ఇళ్లకువెళ్లి వైద్య సేవలందిస్తున్న వైద్యులు
- 46 వాహనాల ద్వారా సేవలు



బొబ్బిలి మండలంలో మంచంపై ఉన్న రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రభుత్వం మరింత ఫోకస్ పెట్టింది. పల్లెల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులందరూ వైద్యసేవలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టింది. వైద్య శిబిరంలో పాల్గొనే వైద్య సిబ్బంది నిర్దేశించిన సమయంలో శిబిరంలో ఉండేలా ఆదేశాలు జారీచేసింది. విధులకు డుమ్మాకొట్టేవారిపై చర్యలకు ఉపక్రమించింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజలకు ఆరోగ్య భరోసా కలుగుతోంది. వైద్య శిబిరాలకు స్పందన పెరగడంతో మరింత ఎక్కువ మందికి మెరుగైన వైద్యసేవలు అందజేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఇంటివద్దనే వైద్యం..

గ్రామీణప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందిచాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి 2022 అక్టోబర్ నెలలో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి ఇప్పటివరకు లక్షలాది మంది వైద్యసేవలు పొందారు. మంచంపై లేవలేని స్థితిలో ఉన్న రోగుల ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. ఊపిరిపోస్తున్నారు. దీంతో రోగులు ఆస్పత్రికి వెళ్లే అవసరం లేకపోతోంది. రోగులకు వ్యయప్రయాసలు తప్పాయి. పక్షవాతం, మంచంపై నుంచి లేవలేని రోగులు, బాలింతలకు 'ఫ్యామిలీ వైద్యం' ఉపశమనం కల్పిస్తోంది. గతంలో ధనవంతుకే పరిమితమైన ఫ్యామిలీ వైద్యం నేడు పేదలకు చేరువకావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

శతశాతం మంది సద్వినియోగం చేసుకునేలా...

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రోగులందరూ వినియోగించుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం బీపీ, సుగర్, ఆస్తమా వ్యాధిగ్రస్తులు, జ్వరాలతో బాధపడేవారు, గర్భిణులు, పిల్లలు ఇలా.. 70 నుంచి 80 శాతం మంది ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు. మిగిలిన 20 శాతం మంది సమాచారం లేక, ఇతర కారణాలతో సేవలకు దూరమవుతున్నారు. వారు కూడా సేవలు పొందేలా ఫ్యామిలీ డాక్టర్ శిబిరం నిర్వహణ ముందురోజు ఆ గ్రామంలో దండోరా వేస్తారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు రోగుల ఇళ్లకు వెళ్లి సమాచారం ఇస్తారు. సేవలపై అవగాహన కల్పిస్తారు.

పీహెచ్‌సీ వైద్యులకు ప్రత్యేక ఆదేశాలు

ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు నిర్వహిస్తారు. ఇందులో పీహెచ్‌సీ వైద్యుడు, ఎంఎల్ హెచ్‌పీ, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, హెల్త్ సూపర్ వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆశవర్కర్లు పాల్గొంటారు. వీరంతా శిబిరం పూర్తయ్యే వరకు విధుల్లో ఉండాలని పీహెచ్‌సీ వైద్యులకు జిల్లా వైద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఇప్పటి వరకు 3.60 లక్షల మందికి వైద్యం

2022 అక్టోబర్ నుంచి నిన్నటి వరకు జిల్లాలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 3,60,093 మంది వైద్యసేవలు పొందారు. ఇందులో గర్భిణులు 17,560 మంది, బాలింతలు 10,213 మంది, బీపీ వ్యాధిగ్రస్తులు 41,019 మంది, సుగర్ వ్యాధిగ్రస్తులు 21,962 మంది, రెండు వ్యాధులు ఉన్నవారు 25,975 మంది, రక్తహీనతతో బాధపడేవారు 2,232 మంది, కిశోర బాలికలు 140 మంది సేవలు పొందారు. క్షయవ్యాధి లక్షణాలున్న వారు 164 మందిని గుర్తించారు. జిల్లాలో 104 వాహనాలు 46 ఉన్నాయి. వాటిపై వైద్యబృందాలు పల్లెలకు వెళ్లి సేవలందిస్తున్నాయి.

ప్రతినెలా 104 బండి వద్దనే మందులు



నా పేరు బి.రాము. మాది గుర్ల మండలంలోని చోడవరం గ్రామం. ఐదేళ్లగా బీపీ ఉంది. 104 వాహనం రాకముందు ప్రైవేటు ఆస్పత్రిలో మందులు వాడేదాన్ని. ప్రస్తుతం మా గ్రామానికి వచ్చే 104 బండి వద్దకు వెళ్లి మందులు తీసుకుంటున్నాను. ఆస్పత్రికి వెళ్లకుండా ఊరిలోనే మందులు అందజేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.



పుర్రేయవలసలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

మెరుగైన వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. శతశాతం మంది రోగులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. వైద్యసేవలు వినియోగించుకునేలా రోగుల ఇళ్లకు వెళ్లి ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు అవగాహన కల్పిస్తున్నారు. వైద్యశిబిరం ముగిసేవరకు వైద్యులు, సిబ్బంది ఉండాలని ఆదేశాలు ఇచ్చాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

అన్నీ ఒకేచోట..

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యులు పరీక్షలు చేస్తారు. మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ బీపీ, సుగర్ పరీక్షలు చేస్తారు. 104 డేటాఎంట్రీ ఆపరేటర్ శిబిరానికి వచ్చిన రోగులకు అందించిన చికిత్స వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గర్భిణులకు బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్యపరీక్షలు చేస్తారు. జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడేవారికి మందులు అందజేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు భోజన విరామ సమయం ఉంటుంది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు వైద్యసేవలందిస్తారు. ఆ తర్వాత మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు చేస్తారు. ఆరోగ్యశ్రీ కింద సేవలు పొందిన వారి ఆరోగ్య వివరాలపై ఆరా తీస్తారు.

న్యూస్‌రీల్

నేత్రదానానికి ముందుకు రావాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: నేత్రదానానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు కోరారు. ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీవరకు నిర్వహించనున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకరి నేత్రదానంతో ఇద్దరిలో అంధత్వాన్ని తొలగించవచ్చన్నారు. వ్యక్తి చనిపోయిన ఆరు గంటలలోగా నేత్రాల్లోని కార్నియాను సేకరించాల్సి ఉంటుందన్నారు. దేశంలో 13 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ శివప్రసాద్, డీఐఓ అచ్యుతకుమారి, డీపీహెచ్ఎన్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా తోటపల్లి ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు


గరుగుబిల్లి: అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నాగావళి నదిలో నీటిప్రవాహం నిలకడగావుంది. శనివారం సాయంత్రానికి 105 మీటర్లకు 104.14 మీటర్ల మేర ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నది నుంచి ప్రాజెక్టులోకి 2,553 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అధికారులు ఒక గేటును ఎత్తివేసి 1,827 క్యూసెక్కుల నీటిని నదిలోకి, కాలువల ద్వారా 1,420 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టువద్ద నీటి పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ప్రిన్సిపాల్ భీమశంకరరావు

కొత్తవలస: మండలంలోని చింతలదిమ్మ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం ఆక్రమణపై కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భీమశంకరరావు కొత్తవలస పోలీసులు, రెవెన్యూ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. కళాశాల ముఖద్వారం వద్ద గుడినిర్మిస్తే విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రహరీ నిర్మాణానికి నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, పనులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాల సెలవు దినాల్లో ఆక్రమణలకు పాల్పడుతున్నారని, కళాశాల స్థలానికి రక్షణ కల్పించాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆక్రమణకు గురువుతున్న కళాశాలకు చెందిన స్థలం

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో హోమాలు జరిపిస్తున్న అర్చకస్వాములు



వెండి మండపం వద్ద కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం, సుదర్శన అష్టక హవనం తదితర హోమాలను జరిపించారు. అనంతరం స్వామివారి వెండి మండపం వద్ద నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ ప్రారంభం

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ పరిధిలోని వాల్తేర్ డివిజన్ అలమండ, కోరుకొండ, విజయనగరం స్టేషన్‌ల మధ్య ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఏబీఎస్) వ్యవస్థను రైల్వే అధికారులు శనివారం ప్రారంభించారు. కొత్త సిస్టమ్ పాత ప్యానల్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌ను భర్తీచేస్తుంది. కొత్త ఏబీఎస్ వ్యవస్థ 17 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తుంది. రైలు కదలికలను స్వయంచాలకంగా నియంత్రిస్తుంది. మెరుగైన రవాణా సామర్థ్యాన్ని పెంచుతుంది. అప్‌గ్రేడ్ రద్దీగా ఉండే సెక్షన్లలో మరిన్నిరైళ్ల నిర్వహణను సులభతరం చేయడంతో పాటు మొత్తం భద్రతను ఏబీఎస్ మెరుగుపరుస్తుంది. ఏబీఎస్ పనులను త్వరగా పూర్తిచేసిన రైల్వేబృందాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి అభినందించారు.



ఏబీఎస్ వ్యవస్థను ప్రారంభిస్తున్న అధికారులు

రేపటి నుంచి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడలు

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ అచ్యుత్‌కుమార్

విజయనగరం: రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించబోయే సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ ఎం.అచ్యుత్‌కుమార్ శనివారం తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించే ఎంపిక పోటీలు మూడురోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు వారి గుర్తింపుకార్డుతో హాజరుకావాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులు అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో విజయవాడ, గుంటూరు జిల్లాల్లో జరగబోయే అథ్లెటిక్స్, బ్యాండ్మింటన్, చెస్, లాన్‌టెన్నిస్, హాకీ, టేబుల్ టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, కుస్తీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అందరికీ ధన్యవాదాలు: రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలోని చినమేడపల్లి వద్ద శుక్రవారం జరిగిన గిరిజనవర్సిటీ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలకు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. మన ప్రాంతానికి వచ్చిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు ఘనస్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. అంచనా వేసిన కంటే అధిక సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, రైతులు, పార్టీశ్రేణులు, అధికారులు, విద్యార్థులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఈ ఆదరణ, అభిమానాలు, ఆశీస్సులు, సహాయసహకారాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

జగన్‌క్రేజ్‌కు కేంద్రమంత్రి ఫిదా..

ఊహించిన దానికంటే భారీగా తరలివచ్చిన జనసందోహాన్ని, వారందరిలో జగన్ క్రేజ్‌ను చూసి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఫిదా అయ్యాయని రాజన్నదొర తెలిపారు. జనాన్ని మంత్రి స్వయంగా తన సెల్‌ఫోన్‌లో వీడియో రూపంలో బంధించారన్నారు. సాధారణంగా సమావేశానికి వేలమంది వరకు రావొచ్చని భావించామని, లక్షమంది దాటి ప్రజలు రావడంతో అనూహ్యస్పందన కనిపించిందని పేర్కొన్నారు. వర్సిటీ నిర్మాణంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. టెండర్లు త్వరగా పూర్తిచేసి నిర్మాణాన్ని ప్రారంభిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.



ఈ నెల 25న జరిగిన గిరిజన వర్సిటీ శంకుస్థాపనలో కేంద్రమంత్రి ధర్మేంధప్రధాన్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో డిప్యూటీ సీఎం రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ

క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఏపీ గిరిజన సంక్షేమ సంఘం వినతి



వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డిపార్ట్‌మెంట్‌కు కేటాయించిన డిప్యూటీ డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. భాషా పండితులు, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయులకు నోషనల్ సీనియార్టీ కల్పించాలని, ఇద్దరు ప్రధానోపాధ్యాయులను డైరెక్టరేట్‌లో సరెండర్ చేయు విధానాన్ని రద్దు చేయాలన్నారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గేదెల శేషగిరిరావు, ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం, ఏఎస్ఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.రామారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్బారావు ఉన్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి



మృతి చెందిన మేక పిల్లలు

సాలూరు: కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి చెందిన సంఘటన పట్టణంలో వైటీసీ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పట్టణంలో రాజులవీధికి చెందిన మేకల కాపరి పిలమూడి రాము తన మేకలను శనివారం స్థానిక వైటీసీ సమీపంలో పాక నుండి మేతకు తరలించాడు. అనంతరం రాము కుటుంబీకులు పాకను శుభ్రపరిచి రోజులు వయస్సు గల మేక పిల్లలను పాకలో ఉంచారు. ఈ క్రమంలో మధ్యాహ్నం పాక వెనుక నుండి కొన్ని వీధి కుక్కలు వెళ్లి మేక పిల్లలపై దాడి చేశాయి. ఈ దాడిలో 31 మేక పిల్లలు మృతి చెందాయి. దీంతో రాము, కుటుంబీకులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. వీటి మీదే జీవనాధారంగా బతుకుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు కోరారు. ఇదే విషయమై స్థానిక కోర్టు సముదాయంలో బార్‌అసోసియేషన్ సభ్యులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ ఒక మంచి అవకాశమని, రాజీకి అనుకూలమైన కేసుల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలన్నారు. కక్షిదారులు కూడా రాజీమార్గాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి.కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.భవానీప్రసాద్, ఏజీపీ ఎస్.పోలారావు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹ 234

స్వామిత్వతో ఆస్తి హక్కు

- గ్రామాల్లో స్థలాలకు, ఇళ్లకు హక్కు పత్రాలు
- క్షేత్ర స్థాయిలో పక్కాగా సర్వే
- ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యకు సర్కార్ చెక్



జంపరకోట వద్ద స్వామిత్వ సర్వేకు డ్రోన్ సిద్ధం చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: తాత తండ్రుల నుంచి గ్రామాల్లో తమ ఆధీనంలో ఉన్న ఇళ్లకు, స్థలాలకు శాశ్వత హక్కు కల్పిస్తూ అవసరమైన పత్రాలను అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో పల్లెల్లో ప్రత్యేకంగా అధికార యంత్రాంగం పక్కా సర్వే చేపట్టింది. స్వామిత్వ పేరిట అధికారులు క్షుణ్ణంగా రీ సర్వే చేసి హద్దులు నమోదు చేస్తున్నారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని గ్రామీణులు అన్ని రంగాల్లో ఆర్థికంగా పురోగతి చెందుతున్నారు. అందుకు అనుగుణంగా గ్రామాల్లో పోటీపడి ఖరీదైన నివాసాలు నిర్మిస్తున్నారు. దీర్ఘకాలంగా గ్రామాల్లో నివాస స్థలాలకు కొన్నిచోట్ల చట్టపరమైన రికార్డులు, డాక్యుమెంట్లు లేకపోవటం గమనార్హం. ఈ క్రమంలో ఆర్థిక అవసరాలకు తమ ఇళ్లు లేదా స్థలాలను అమ్ముకోవాలన్నా, తాకట్టు పెట్టాలన్నా ఇబ్బందులు తప్పవు. పట్టణాల్లో మాదిరి అసరాలకు తమ ఆధీనంలో ఉన్న ఆస్తులు అక్కరకు రాకపోవటంతో ఆవేదన వ్యక్తమయ్యేది. గ్రామకంఠాల్లో ఉన్న ఇళ్లు, పశువుల దొడ్లు తదితర వాటికి ఎటువంటి హక్కులు ఉండేవి కాదు. దీనిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేసింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పంచాయతీ రాజ్, రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా స్వామిత్వ పథకం అమలుకు శ్రీకారం చుట్టాయి. గ్రామీణ ప్రజలకు సంబంధించి ఆస్తులకు యాజమాన్య హక్కు పత్రాలు అందించేందుకు సమష్టిగా ఈ శాఖలు చర్యలు చేపట్టాయి. ఈ నూతన విధానంతో తమ ఆస్తులను అవసరాల కోసం సద్వియోగపర్చుకునే అవకాశాలు పల్లె వాసులకు ఇకపై మెరుగుపడతాయి. ఈ హక్కు పత్రాల ద్వారా బ్యాంకుల నుంచి చట్టప్రకారం రుణాలు పొందవచ్చు.

జిల్లాలో స్వామిత్వ వివరాలు ఇలా...	
జిల్లాలో మండలాలు	15
గ్రామ పంచాయతీలు	451
రెవెన్యూ గ్రామాలు	955
స్వమిత్వ డ్రోన్ సర్వే చేపట్టిన గ్రామాలు	546
డ్రోన్ మ్యాప్ -1 పూర్తి చేసుకున్న గ్రామాలు	174
డ్రోన్ మ్యాప్-1 జనాభా లేని గ్రామాలు	09
డ్రోన్ మ్యాప్-1 జనాభా ఉన్న గ్రామాలు	165
ప్రాథమిక సర్వే జరుగుతున్న గ్రామాలు	85
నిబంధనల ప్రాప్తికి 42 వివరాలు నమోదు చేసుకున్న గ్రామాలు	59
క్షేత్రస్థాయిలో సమగ్ర సమాచారం పూర్తి చేసుకున్న గ్రామాలు	12
పూర్తి స్థాయిలో సర్వే చేసి రికార్డు అధారిటీ పొందిన గ్రామాలు	4



పాలకొండ డ్రోన్ విజువల్

పక్కాగా వివరాల నమోదు

స్వామిత్వ పథకం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో స్థలం, ఇళ్ల ఫొటోలు తీస్తారు. ఇళ్లు, ఇంటి పరిసరాలు, ఖాళీ స్థలాల కొలతలు సేకరిస్తారు. ఇంటి యజమాని పేరు, పూర్తి వివరాలు నమోదు చేస్తారు. పక్కనే ఉన్న గృహ హక్కుదారుల వివరాలతో హద్దులు నమోదు చేస్తారు. రోడ్లు, ఇతర సమాచారం, ఖాళీ స్థలాల పొడుగు వెడల్పుల లెక్కలు నమోదు చేస్తారు. ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు.

బహుళ ప్రయోజనాలు

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయటం వలన గ్రామాల్లో ఉన్న ఇళ్ల, స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు తక్షణమే పొందేందుకు అవకాశం ఉంటుంది. ఇంటి విలువ ఆధారితంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చు. మీసేవ ద్వారా ఇంటికి, స్థలాలకు సంబంధించిన వివరాలు పొందవచ్చు. మండల, గ్రామ స్థయి అధికారులు చేపడుతున్న ఈ సర్వే ప్రాప్తికి సమగ్ర సమాచారం ఆన్‌లైన్ చేస్తారు. నూతనంగా ఏర్పడ్డ పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాలు, 451 గ్రామ పంచాయతీలు, 955 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ రెవెన్యూ గ్రామాల్లో స్వమిత్వ ద్వారా రీ సర్వే చేపడుతున్నారు. ఇప్పటికే 546 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశారు. వీటిలో యాజమాన్య హక్కులు కల్పించే ప్రాపర్టీ కార్డులు, ప్రాపర్టీ పార్సెల్ మ్యాప్‌లు తయారు చేసి తొలి విడతగా 174 గ్రామాల్లో హక్కు పత్రాల పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



బుక్కూరు గ్రామ పరిధిలో భూములకు సంబంధించిన డ్రోన్ విజువల్

సాంకేతిక పరిజ్ఞానంతో..

జిల్లాలో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు రూపొందిన స్వమిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియా) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం అధికారులు సాంకేతికతను వినియోగిస్తున్నారు.

హద్దులు పక్కాగా తేల్చేందుకు డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. గ్రామాల్లో డ్రోన్‌లతో సర్వే చేసి ప్రజలకు రికార్డ్ ఆఫ్ రైట్స్ కార్డులు మంజూరు చేస్తున్నారు. తద్వారా పల్లెల్లో ఆస్తి హక్కులపై యజమానులకు స్పష్టత కల్పిస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ విధానంలో పంచాయతీలకు ఆస్తి పన్నుల వసూలుకు వెసులుబాటు ఏర్పడుతుంది.

సమగ్ర సమాచారం



స్వమిత్వ పథకం ద్వారా గ్రామాల్లో సమగ్ర సమాచారం సేకరిస్తున్నాం. 15 మండలాల పరిధిలో 955 రెవెన్యూ గ్రామాల్లో ప్రణాళిబద్ధంగా డ్రోన్ సర్వే చేపడుతున్నాం. ఇప్పటికే 174 గ్రామాల్లో మ్యాప్ - 1 పూర్తి చేసాం. గ్రామాల్లో గృహాలు, ఖాళీ స్థలాలు, ఇతర ప్రోపర్టీలకు సంబంధించిన సమగ్ర సమాచారానికి సాంకేతికతను జోడించి వివరాలు ఆన్‌లైన్ చేయిస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ప్రారంభిస్తాం.

– బలివాడ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

సీఎం జగన్‌తోనే సొంతింటి కల సాకారం

- విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- 243 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు హక్కు పత్రాలు, తాళాల అందజేత



టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందజేస్తున్న నగర మేయర్ తదితరులు

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని, ఇదే వాస్తవాన్ని ఇప్పటికే ఆచరణలో చేసి చూపిస్తున్నారని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 243 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్టర్ డాక్యుమెంట్లను, ఇంటి తాళాలను శనివారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పేదవారి ఇంటి కలను నిజం చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలను అందజేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ఈ విషయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్థానికంగా ప్రత్యేక శ్రద్ధ కనబరచి లబ్ధిదారులకు అనువుగా ఉండే విధంగా అన్ని సౌకర్యాలను మెరుగుపరిచారని చెప్పారు. శ్రావణ మాసం నేపథ్యంలో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకొని సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయ యాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్ బండారు ఆనందరావు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు అల్లు చాణక్య, ఆల్తి సత్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

29న మెగా జాబ్‌మేళా



మెగాజాబ్ మేళా వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగు కళాశాలలో ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.జాషువాజయప్రసాద్ తెలిపారు. జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను కళాశాలలో వారు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతీ కళాశాల, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్తంగా ఈ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తుందని తెలిపారు. మేళాలో ఐటీ, మ్యానుఫ్యాక్చరింగ్, ఫార్మా,బ్యాంకింగ్, ఆటోమొబైల్స్ తదితర రంగాలకు సంబంధించి టెక్ మహీంద్ర, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంకు, హెటరోడ్రగ్స్, జయభేరి ఆటోమోటివ్ ప్రైవేటు లిమిటెడ్, సైనస్టిక్స్ లాబ్స్ అల్ట్రాటెక్ సిమెంటు, వరుణ్ మోటార్స్ వంటి 16 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం, రాజాం, నెల్లిమర్ల, విజయనగరం, లావేరు తదితర ప్రాంతాల్లో ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమో, బి.టెక్, ఎం.టెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 63004 95265, 88862 87495 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

శృంగవరపుకోట: మండలంలో అమ్మపాలెం గ్రామానికి చెందిన వన్నెపురి శ్రీనివాసరావు(45) శుక్రవారం రాత్రి ఒంటి గంట సమయంలో మృతి చెందినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు చెప్పారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అమ్మపాలెం గ్రామానికి చెందిన వన్నెపురి శ్రీనివాసరావు(45) అనారోగ్యంతో కొంత కాలంగా ఇబ్బంది పడుతున్నాడు. కాళ్లు చేతులు సక్రమంగా పని చేయవు. ఈ క్రమంలో మద్యానికి బానిస అయ్యాడు. శుక్రవారం రాత్రి భార్య అతనితో మాట్లాడుతూ మనకి ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు.. నీకు ఆరోగ్యంగా సరిగా లేదు.. మద్యం తాగి మరింత అనారోగ్యానికి గురైతే ఎలాగని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మద్యం మత్తులో గడ్డి మందు శుక్రవారం మధ్యాహ్నం తాగాడు. వెంటనే శ్రీకాకుళం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి శ్రీనివాసరావు మృతి చెందినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

మద్యానికి బానిసై...

విజయనగరం క్రైమ్: మద్యానికి బానిసై, తిండి తిప్పల్లేక ఇంట్లో పడి మృత్యువాతకు గురైన వ్యక్తి ఇంటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు, అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక స్టేడియం కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న పెనుమజ్జి సూర్యనారాయణమూర్తి (40) మద్యానికి బానిసయ్యాడు. పగలు, రాత్రీ తేడా లేకుండా మద్యం సేవిస్తూ, తిండి, తిప్పల్లేక గత నాలుగు రోజులు నుంచి ఇంట్లోంచి బయటకు రాలేదు. అయితే శుక్రవారం నుంచి అతను ఉంటున్న ఇంటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు అతని మేనల్లుడుకి సమాచారమిచ్చారు. దీంతో అతను వచ్చి పరిశీలించి సచివాలయ సిబ్బందికి, పోలీసులకు సమాచారమిచ్చాడు. టుటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అప్పటికే మృతి చెంది నాలుగు రోజులైనట్లు గుర్తించారు. మృతదేహాన్ని కేంద్రాస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ పైడితల్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్న వారిపై ఫిర్యాదు



కొత్తవలస సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్



చీపురుపల్లి రూరల్: ఎస్ఐకు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్లు



ఎస్సై నరేష్‌కు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా సభ్యులు



రాజాం సిటీ: టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్లు



ఎస్.కోట: పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా ప్రతినిధులు



భోగాపురం: పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నేతలపై ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

కొత్తవలస : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, సిహెచ్.అయ్యన్నపాత్రుడులపై తగు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్.కోట నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్ కర్రి దేముడుబాబు కొత్తవలస సీఐ వి.చంద్రశేఖర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. వారిపై కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల సోషల్ కన్వీనర్లు ఎ.సంతోష్‌కుమార్, ఆతవ రమేష్, లంక సరసింహారావు ఉన్నారు.

లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ పి.శ్రావణ్‌కుమార్ తెలుగు దేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, కార్యదర్శి నారా లోకేష్లపై శనివారం ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరిపై కేసు నమోదు చేయాలని కోరారు.

రాజాం సిటీ: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న టీడీపీ నేత నారా లోకేష్‌పై రాజాం టౌన్, రూరల్ సోషల్ మీడియా కన్వీనర్లు రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో యువగళం పాదయాత్ర వేదికగా టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న లోకేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. నియోజకవర్గ కన్వీనర్ అగిరేడు వీరాస్వామి, టౌన్ కన్వీనర్ వైవీ సుశీల, రూరల్ కన్వీనర్ బట్న వంశీ, కో కన్వీనర్లు వాసు, నరేంద్ర, వెంకటరావు, సచివాలయ కన్వీనర్లు రమ్య, జయలక్ష్మి, రాజారావు ఉన్నారు.

చంద్రబాబుపై ఫిర్యాదు

చీపురుపల్లి రూరల్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడులపై తగు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సన్యాసినాయుడుకు ఫిర్యాదును అందజేశారు. నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ ప్రభాత్‌కుమార్, మండల సోషల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్, కో కన్వీనర్లు గురాన జనార్దన్, పేకాపు ప్రసాద్, బైరెడ్డి కామేష్, రామలింగాపురం సచివాలయ సోషల్ మీడియా కన్వీనర్ రౌతు భాస్కర్ పాల్గొన్నారు.

ఎస్.కోటలో...

శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్‌పై కేసు నమోదు చేయాలని జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మామిడి శంకరరావు తదితరులు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న నారా లోకేష్ , చంద్రబాబు, అచ్చెన్నాయుడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కో కన్వీనర్లు కె.జయశంకర్, షేక్ మౌలానా, ఎం.సురేష్, కె అప్పయ్య ఉన్నారు.

పూసపాటిరేగ: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ కొత్తకోట రమేష్, తదితరులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కె.చిన్నారావు, భాస్కరరావు, జగన్నాథం, రమేష్ పాల్గొన్నారు.

భోగాపురంలో..

భోగాపురం: పాదయాత్రలు, బహిరంగ సమావేశాల పేరుతో రాష్ట్రంలో ప్రజల శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ బాకీ వెంకట కనకారావు కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోషల్ మీడియా ప్రతినిధులతో కలిసి టీడీపీ నేతలపై ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా ప్రతినిధులు శీరపు వంశీరెడ్డి, సూర్యనారాయణ, గోవింద్, సూరిబాబు, అప్పన్న పాల్గొన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికార పక్ష నాయకులను కించపరిచే విధంగా మాట్లాడడి సరికాదన్నారు. కార్యక్రమంలో బూర పైడిరాజు, తట్టికాయల జయప్రకాష్, బొత్తు సాగర్‌రెడ్డి, మద్దు లక్ష్మణ ఉన్నారు.